
తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీగా వచ్చిన రైతు సంఘాల నాయకులు


ఎస్.ఎన్.పాడులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులను మోసం చేసిన ప్రభుత్వాలు

చీమకుర్తి: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆయా పార్టీల పిలుపు మేరకు మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే నిర్ణయాలను తీసుకుంటూ పేదల పట్ల మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రతి ఒక్కరు తిప్పికొట్టాలన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జూలై నెల 9న చేపట్టనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వచ్చి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్యకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, కార్మిక సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి..

సంతనూతలపాడు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పనకు ఆ మేరకు చట్టం చేయాలని కోరుతూ సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద గ్రామీణ హర్తాళ్‌లో భాగంగా మంగళవారం రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని దివాళ తీసేందుకుగాను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు నడుం బిగిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఆయా విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించగా గత్యంతరం లేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పొగాకు రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా రైతుల అప్పులను రద్దు చేయాలని, జిల్లాలో వెనుకబడిన ప్రాంతం అభివృద్ధికి ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.2000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ కార్మిక హక్కులు కాల రాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా సమస్యలపై తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కరిచేటి హనుమంతరావు, సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, సంఘ నాయకులు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడులో నిరసన తెలియజేస్తున్న రైతులు


చీమకుర్తిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వామపక్షాలు, రైతు నాయకులు

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: రైతులు, కార్మిక, కర్షక ఉపాధి కూలీలు భవణ నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త హర్తాళ్‌లో భాగంగా మంగళవారం ఉప్పుగుండూరు, కండ్లగుంట, అమ్మనబ్రోలు తదితర గ్రామాల్లోని సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందచేశారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతి బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా రైతు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధరలేక అప్పులపాలై ఆత్మహత్యల వైపు దారితీస్తుందన్నారు. ప్రస్తుతం పండించిన శనగ, మిర్చి, పొగాకు, మినుము తదితర పంటలకు గిట్టుబాటు ధరలేక కొనే నాథుడు లేక రైతులు దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదేవిధంగా బర్లీ పొగాకు కొనుగోలు లేక కౌలు రైతులు కూలీలకు డబ్బులు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారన్నారు., గుండ్లకమ్మ ప్రాజెక్టు కాలువల్లో పూడిక తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలపర్తి యోనా, రావెళ్ల వెంకట్రావు, ఎస్ కృష్ణారావు, ఎన్ రామారావు, కే చిరంజీవి వివిధ రంగాల కార్మికులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డలగుంటలో తమలపాకు పూజలో మహిళలు


గడ్డలగుంటలో తమలపాకు పూజలో మహిళలు


అలంకరణలో ద్వారకానగర్ ఆంజనేయస్వామి

వీరాంజనేయస్వామికి విశేష పూజలు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా హనుమజ్జయంతి మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒంగోలు కేశవ పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, లాయర్‌పేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం, ముంగమూరు డొంక మర్రిచెట్టు కాలనీలోని పొలిమేర అభయాంజనేయ స్వామి, మంగమూరు డొంక సుందర నగరంలోని పంచముఖ ఆంజనేయ దేవస్థానం, గద్దలగుంటలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, ఒంగోలు ద్వారకానగర్ మాత శిశు వైద్యశాల దగ్గర వీరాంజనేయ స్వామి దేవస్థానం, సంతపేట షిరిడి సాయిబాబా మందిరంలో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు అలంకరణలు వైభవంగా నిర్వహించారు. ద్వారకానగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ఉదయం స్వామివారికి విశేష హోమం నిర్వహించి మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కేశవపేటలోని వీరాంజనేయస్వామి పూజలో భక్తులు

వరుసగా రెండో రోజు తగ్గిన కనిష్ట ధర


కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కనిష్ట ధర కేజీ రూ.203 పలకగా మంగళవారం నిర్వహించిన వేలంలో మరొక మూడు రూపాయలు తగ్గి రూ.200 పలికింది. పొగాకు ధరలు పెరిగితే తమ పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు అనుకుంటుంటే ధరలేమో రోజురోజుకూ తగ్గుతున్నాయి. ధరలు తగ్గడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.200 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునిల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన రైతులు వేలానికి 740 బేళ్లను తీసుకొచ్చారు. అందులో 585 బేళ్లు కొనుగోలుయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 155 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, సరాసరి ధర కేజీ రూ. 254.62గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం లారీ ఆఫీస్ సమీపంలో పేకాట శిబిరంపై ఎస్సై నాగమల్లేశ్వరరావు మంగళవారం తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7250 నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

వైభవంగా కంచి పరమాచార్య జయంతి


హోమక్రతువులో వేద పండితులు, డాక్టర్ శ్రీధర్ దంపతులు


ప్రత్యేక అలంకరణలో కంచి పరమాచార్యస్వామి

ఒంగోలు మెట్రో: కంచి పరమాచార్య జయంతిని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. నగరంలోని రంగారాయుడు చెరువు దగ్గర కంచి పరమాచార్య ధార్మిక సేవా సమితి సత్సంగ మందిరంలో పరమాచార్య 132వ జయంతి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, పరమాచార్య స్వామి పంచలోహ విగ్రహానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గోపూజ నిర్వహించారు. సుబ్రహ్మణ్య హోమం, రుద్ర హోమంలో ధీరజ్ హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ దంపతులు పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు దుర్భాకుల కృష్ణ చైతన్య, శ్రీరామ్ శర్మ, దత్తాత్రేయ శర్మ, రవితేజ శర్మ, వారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సెక్రెటరీ గోనిపేట సాయిచంద్, జాయింట్ సెక్రెటరీ చిన్నం మధుసూదన్‌రావు భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సంతనూతలపాడు: లబ్ధిదారుల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో సురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ డిప్యూటీ ఇంజినీర్ పీ చెన్నరాయుడు, మండల హౌసింగ్ ఏఈ వీ కిరణ్‌లతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల అదనపు నిధులను విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులు ఆయా గృహాలను మరింతగా వేగంగా నిర్మించుకునేందుకు వారిని మరింతగా చైతన్య పరచాలని ఎంపీడీవో కోరారు. అధికారులు మండలంలోని చంద్రపాలెం లే అవుట్లను పరిశీలించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతంపై లబ్ధిదారులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలపై సమీక్ష చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశం

ఒంగోలు సిటీ: స్వాతంత్ర్య సమర యోధుడు.. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శప్రాయుడని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం యూనివర్శిటీలో ప్రకాశం పంతులు చిత్రపటానికి సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బాల్యంలో ఎన్నో ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ మొక్కవోని ధైర్యం, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో అధిగమించారన్నారు. లక్ష్య సాధనయే పరమావధిగా భావించి, ఉన్నతమైన చదువులు చదివి తెలుగుజాతి గర్వించదగిన మహనీయులుగా ప్రజల హృదయాల్లో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా తన జీవితాన్ని పణంగా పెట్టి ప్రజా సంక్షేమం, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం శక్తి సామర్థ్యాలను వినియోగించి కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. ఆయన జీవితం నేటి సమాజానికి, యువతరానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రకాశం పంతులు స్మృతికి చిహ్నంగా ఆయన జన్మస్థలమైన ఒంగోలు ప్రాంతానికి ప్రకాశం జిల్లా అని, ఒంగోలులో నూతనంగా ఏర్పడిన విశ్వ విద్యాలయానికి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ అని నామకరణం చేయడం సంతోకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ రాజామోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ నిర్మలా మణి, సీడీసీ డీన్ జీ సోమశేఖర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్స్‌లర్ మూర్తి

దళిత విద్యార్థిపై దాడి అమానుషం

ఒంగోలు వన్‌టౌన్: తిరుపతిలో బీటెక్ విద్యను అభ్యసిస్తున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషమని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ అన్నారు. మంగళవారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకుల విద్యార్థులు, రౌడీ షీటర్‌లు కులం పేరుతో దాడి చేసి, మూత్రం తాగించిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. యశ్వంత్‌నాయుడు అనే వ్యక్తి అతని అనుచరులు జేమ్స్‌పై తీవ్రంగా దాడి చేసి కొట్టారన్నారు. దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ దళితులపై కూటమి ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట నిత్యం దళితులను టార్గెట్‌గా చేసుకొని దాడులు చేయడం హేయమని పేర్కొన్నారు. ఇలాగే దాడులు చేస్తుంటే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గద్దె త్యాగరాజు, మహేష్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

షో లైట్లు లేవు.. స్ట్రీట్ లైట్లూ లేవు !


చీకటిలో ఉన్న కలెక్టరేట్ పక్క నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు


చర్చి సెంటర్‌లో వెలగని సెంట్రల్ లైటింగ్

- అంధకారంలో చర్చి సెంటర్
- వెలగని స్ట్రీట్ లైట్‌లు

ఒంగోలు వన్‌టౌన్: నగరంలో చర్చి సెంటర్‌కు ఒక ప్రాముఖ్యత ఉంది. జిల్లాకే ఒక ఐకానిక్‌లాంటిది. అలాంటి చారిత్రక పేరున్న సెంటర్ అంధకారంలో మగ్గుతోంది. గత రెండు రోజులుగా స్ట్రీట్ లైట్‌లు వెలుగకపోవడంతో అంధకారం అలుముకుంది. గతంలో చర్చి సెంటర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హైమాస్క్ లైట్‌ల సముదాయం పని చేయడం లేదు. దీంతో జంక్షన్ చుట్టూ చీకటిగా ఉంది. కలెక్టరేట్ పక్క నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో గతంలోనే ఏర్పాటు చేసిన స్ట్రీట్‌లైట్‌లు కూడా పని చేయడంలేదు. ఈ ఏ ప్రాంతంలో లక్షలు ఖర్చు పెట్టి షో లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్లు కనిపించేందుకుగా ప్రధాన స్ట్రీట్‌లైట్‌లను ఆపివేస్తున్నట్లు సమాచారం. పోని అవి కూడా పనిచేస్తున్నాయంటే అదీ లేదు. దీంతో పాదాచారులు, వాహనాలదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కన చర్చి నుంచి వచ్చే కాంతితో కొంత మేరకు రోడ్డు కనిపిస్తుంది. మున్సిపాలిటీకి చెందిన లైటింగ్ విభాగం కానీ, సచివాలయానికి చెందిన ఎమినిటీస్ విభాగం వారు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని నగర ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

ఆలస్యంగా వెలుగు చూసిన చోరీ

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు బీసీ కాలనీ సమీపంలో దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అందిన వివరాల మేరకు.. బీసీ కాలనీకి చెందిన అన్నదమ్ములు గోరంట్ల వెంకటేశ్వర్లు, తమ్ముడు శివ లు వ్యాపారం నిమిత్తం నాయుడుపేట సమీపంలోని కోట వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో గత ఆదివారం వారి ఇద్దరి ఇళ్లలో చోరీ జరిగింది. సోమవారం మధ్యాహ్నం విషయం గమనించిన ఇరుగుపొరుగు వారు వారికి సమాచారం అందించడంతో వారు సోమవారం రాత్రికి ఇంటికి చేరుకున్నారు. వెంకటేశ్వర్లు ఇంట్లో మూడున్నర సవర్ల బంగారం, రూ.30 వేల నగదు, శివ ఇంటిలో ఒక సవర బంగారం, ఎనిమిది గ్రాముల వెండి రూ.10 వేల నగదు పోయిందని గుర్తించి మంగళవారం ఉదయం మద్దిపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

తప్పిపోయిన భర్తను వెతికించాలని ఫిర్యాదు


షేక్ కరీముల్లా

మద్దిపాడు: ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన తన భర్తను వెతికించాలంటూ మండలంలోని లింగంగుంట గ్రామానికి చెందిన షేక్ మొగల్ జాన్‌బీ మద్దిపాడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. తన భర్త షేక్ కరీముల్లా బాబు గత 16 ఏళ్ల నుంచి మతిస్థిమితం లేక అప్పుడప్పుడు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి మూడు, నాలుగు నెలల పాటు తిరిగి వస్తూ ఉంటాడని తెలిపింది. అదే క్రమంలో అతను గతేడాది ఆగస్టులో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇప్పటి వరకు తిరిగి రాలేదని దాంతో భార్య స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. పైఫోటోలోని వ్యక్తి ఆచూకీ తెలిసినవారు స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం


వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి అఫ్సర్

చీమకుర్తి రూరల్: రెండు రోజుల నుంచి వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూచుకోవాలని బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అఫ్సర్ అన్నారు. మంగళవారం మంచికలపాడు సచివాలయ పరిధిలోని చీమలమర్రి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో 104 సేవలు అందించారు. వారు మాట్లాడుతూ ఈ రోజు 48 ఓపీలు వచ్చాయని జ్వరం, జలుబు, దగ్గు బారిన పడినవారికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే అవి దోమలకు ఆవాసాలుగా తయారై దోమకాటు వలన డెంగీ బారిన పడతారన్నారు. నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మేరి, అంగన్‌వాడీ సిబ్బంది స్వర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కొత్తపట్నం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో త్రివిధ దళాలకు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతూ బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పల్లెపాలెంలో మంగళవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కొత్తపట్నం బీజేపీ ఇన్‌చార్జి మాకినేని అమర సింహం సారథ్యంలో జరిగిన ర్యాలీని జిల్లా అధ్యక్షుడు సీ శ్రీనివాసరావు ప్రారంభించారు. భారత మాతకు జై అంటూ నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. యుద్ధంలో మరణించిన అమర జవానులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ భద్రత పటిష్టంగా ఉందనడానికి ఆపరేషన్ సందూరే ఉదాహరణ అని చెప్పారు. పాకిస్తాన్‌పై విజయం సాధించి భారత సైన్యం ఇతర దేశాలకు దీటుగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు జి.వీరభద్రాచారి, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు తోట సునీల్ యాదవ్, జె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శైలజ స్కిన్ క్లినిక్ ప్రారంభం


శైలజ స్కిన్ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు టౌన్: నగరంలోని తాలూకా పోలీసుస్టేషన్ ఎదురుగా శైలజ స్కిన్ క్లినిక్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ అన్ని రకాల చర్మ వ్యాధులకు అత్యంత ఆధునిక వైద్య పరికరాలతో చికిత్స చేయనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు అడ్వాన్స్‌డ్ ట్రీ వేవ్ లేజర్ చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మెరుగైన వైద్య చికిత్సతో మంచిపేరు తెచ్చుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు కోరారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు శిక్షణ, ఉద్యోగ మేళా

చీమకుర్తి: దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలను కల్పిస్తారని ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రం ప్రిన్సిపాల్ ఎస్ అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తికి చెందిన ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాల తిరుపతికి చెందిన యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్‌లో శిక్షణనిచ్చి ఉద్యోగాలను కల్పిస్తారన్నారు. శారీరక వైకల్యం, మూగ, చెముడు కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు పదో తరగతి సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డును తీసుకొని చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాల వద్దకు ఈనెల 24వ తేదీ హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.